టిటిడికి ఎలక్ట్రిక్ స్కూటర్ విరాళం

ప్రజాశక్తి - తిరుమల

తిరుపతి గాయత్రీ ఆటోమోటివ్‌కు చెందిన రవి బుధవారం రూ.1.08 లక్షలు విలువైన బగుస్ సి12ఐ మాక్స్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను టిటిడికి విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయం ఎదుట డెప్యూటీ ఈవో లోకనాథంకు స్కూటర్ తాళాలు అందించారు. ఈ కార్యక్రమంలో తిరుమల డిఐ జానకిరామిరెడ్డి పాల్గొన్నారు.

'మహాకవి శ్రీశ్రీ'మార్గం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'శాశ్వత అభివృద్ధి మా అజెండా' అని తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. నగర పరిధిలోని 17వ డివిజన్ ఓబులం ఆస్పత్రి నుంచి గ్రీన్ పార్కు అపార్టుమెంట్ వరకూ 22 లక్షల 75వేల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన మహాకవి శ్రీశ్రీ మార్గాన్ని బుధవారం ఉదయం మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరితతో కలిసి ప్రారంభించారు. ఉప మేయర్ ముద్రనారాయణ, అభినయ్‌రెడ్డి, కార్పొరేటర్లు ఎస్‌కె బాబు, ఆంజనేయులు, నరసింహ ఆచారి, అదనపు కమిషనర్ సునీత, ఎస్ఇ మోహన్ పాల్గొన్నారు.

'జగనన్న మహిళా మార్టు' రాష్ట్రంలో ముందంజ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం ఏర్పాటు చేసిన జగనన్న మహిళ మార్ట్‌లు మహిళ సాధికారత లక్ష్యంతో రాష్టంలో ముందంజలో నడుస్తున్నాయి, మార్ట్ ద్వారా మహిళలను పారిశ్రామిక వ్యక్తులుగా తీర్చి దిద్దడమే లక్ష్యమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మెప్మా మిషన్ డైరెక్టర్ వి. విజయ లక్ష్మి బుదవారం చిత్తూరు జిల్లా సిబ్బంది సమావేశం నందు తెలిపారు. ఒక్కొక్క సంఘ సభ్యుల వాటా ధనం 150 రూపాయలతో మార్ట్ లను ఏర్పాటు చేసి తక్కువ ధరలతో నాణ్యమైన వస్తువులతో, అమ్మకాలు సంవత్సరానికి 3. 8 కోట్లతో ముందంజలో ఉన్నాయని, రానున్న 3 నెలల్లో 20 మార్టులను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సంఘ సభ్యులు మాత్రమే కాకుండా ప్రజలు అందరూ మార్టు లలో కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మెప్మా పీడీ రాధమ్మ పాల్గొన్నారు.

'గంగమ్మ' సేవలో రక్షణ శాఖ సలహాదారు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆధ్యాత్మిక నగరంలోని గంగమ్మ దేవతను రక్షణ శాఖ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ప్రాచీన కాలంలో గంగమ్మ దేవతను దర్శించుకుని తిరుమల స్వామివారి దర్శనానికి వెళ్లే ఆచారం ఉండేదని గుర్తుచేశారు. బుధవారం ఉదయం గంగమ్మ తల్లి పున్ణప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవంలోపాల్గొన్నారు. తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ డి.హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ గంగమ్మ తల్లి వైభవాన్ని దశదిశలా వ్యప్తి చేయడానికి తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి కృషి అభినందనీయమన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి చెల్లెలైన గంగమ్మకు 700 సంవత్సరాలుగా జాతరలు నిర్వహిస్తున్నారని, దేశంలోనే జాతర ఇక్కడే మొదలైనట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. మహాకుంభాభిషేక మహోత్సవంగోపూజతో ప్రారంభమయ్యింది. ఆఫ్రాన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థవారు తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా ఐదు లక్షల రూపాయలను విరాళంగా ఎంఎల్ఎకు అందజేశారు.

జగనన్న భూ శాశ్వత హక్కు రీ సర్వే ప్రారంభం

తిరుపతి టౌన్ : జగనన్న భూ శాశ్వత హక్కు, భూ సంరక్షణ రీ సర్వే పనులు పక్కాగా నిర్వహించాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. రీసర్వే డ్రోన్ ఫ్లయింగ్‌ను వినాయకసాగర్ వద్ద కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలో ఐదు రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ ఫ్లయింగ్ ప్రారంభించామన్నారు. ఈ పనులను ఐరో డ్రైన్ సంస్థ నిర్వహిస్తోందన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని ఐదువేల సర్వే నంబర్లు, 27 స్వేర్ యార్డ్‌లు, 50 వార్డులు, 102 సచివాలయాల పరిధిలో డ్రోన్ సర్వేచేస్తారన్నారు. వాతావరణం అనుకూలిస్తే వారం రోజుల్లో సర్వే పూర్తవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ సునీత, అర్బన్ తహశీల్దార్ వెంకటరమణ, ఎసిపి బాలసుబ్రమణ్యం, టిపిఒ సాయిలీల, శారదాంబ, ధర్మరాజు పాల్గొన్నారు.

తనపల్లి క్రాస్‌లో అఖిలపక్షం రాస్తారోకో

ఉక్కు హక్కూ మాదే...

జిల్లావ్యాప్తంగా నిరసనల హోరు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

'విశాఖ ఉక్కు మాదే... దానిపై హక్కూ మాదే.. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపకపోతే సహించేది లేదు' అని అఖిలపక్షం హెచ్చరించింది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర పిలుపులో భాగంగా సిపిఎం, సిపిఐ, సిఐటియు, ఎఐటియుసి, టిడిపి, కాంగ్రెస్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం తిరుపతి సమీపంలోని తనపల్లి హైవేలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాక్రిష్ణ మాట్లాడుతూ మూడు లక్షల కోట్ల విలువ చేసే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను విదేశీ పోస్కో, స్వదేశీ ఆదానీలకు 30వేల కోట్లకు అప్పగించాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రజా పోరాటం ద్వారా ఈ కుట్రను వమ్ము చేయగలుగుతున్నామన్నారు. ఒకవైపు మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భయ భారత్, స్వయం సమృద్ధి నినాదాలు చేస్తూ, మరోవైపున దేశంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నీ విదేశీ కంపెనీలకు అమ్మేయడం ఏరకమైన దేశభక్తి అని ప్రశ్నించారు. 2017లో స్టీల్‌ప్లాంట్‌లోని 4వేల ఎకరాల భూమిని పోస్కోకు అప్పగించే ఒప్పందం కేంద్ర ప్రభుత్వం చేసిందన్నారు. 2020, మార్చి తరువాత కోవిడ్‌ను అడ్డం పెట్టుకుని ప్రజలు తిరుగుబాట్లు చేయరని ఇష్టం వచ్చినట్లు భారీ పరిశ్రమలన్నీ విదేశీ కంపెనీలకు అప్పగించవచ్చని భావించి విశాఖ ఉక్కును అమ్మేయాలని కేంద్ర ప్రభుతం భావించిందన్నారు. అదానీకి స్టీల్‌రంగంలో అనుభవం లేకపోవడంతో పోస్కోను వెంట తెచ్చుకుందన్నారు. అదానీని బిజెపి బ్రోకర్‌గా వాడుకుంటుందన్నారు. రాష్ట్రంలోని బూర్జువా పార్టీలైన వైఎస్ఆర్ కాంగ్రెస్, టిడిపి, జనసేనలు ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టి చోద్యం చూస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఆర్.లక్ష్మి, కె.వేణుగోపాల్, పి.మునిరాజ, ఇఎస్ కుమార్, భాస్కర్, పి.బుజ్జి, మాధవ్‌కృష్ణ, రాధాక్రిష్ణ, కె.సుమన్, సుజాతమ్మ, బాదుల్లా, భాస్కర్, సూర్య, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కె.కుమార్‌రెడ్డి, ఎన్‌డి రవి, విశ్వనాథం, మంజుల, నదియా, టిడిపి నాయకులు మనోహర్ ఆచారి, కాంగ్రెస్ నాయకులు శివకుమార్ పాల్గొన్నారు.

పుత్తూరులో..

గూడూరు టౌన్‌లో.. టవర్‌క్లాక్ సెంటర్లో విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ పిలుపు మేరకు వామపక్షాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్రానికి బంగారుగుడ్డు పెట్టే విశాఖ ఉక్కును పోస్కో కంపెనీకి కట్టబెట్టాలని కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చూడటం

శ్రీకాళహస్తిలో..

దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో జోగి శివకుమార్, బివి రమణయ్య, ఆర్.శ్రీనివాసులు, అడపాల ప్రసాద్, ఎస్.సురేష్, సిపిఐ నాయకులు ఎస్‌కె కాలేషా, ఎంబేటి చంద్రయ్య, యాకబ్ పాల్గొన్నారు.

సత్యవేడులో.. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సిఐటియు ఆఫీసులో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సిఐటియు నాయకులు రమేష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అరుణాచలం మాట్లాడుతూ 1970లో విశాఖ ఉక్కు పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌కు ఆదాయ వనరుగా ఉందన్నారు. ప్రధాని మోడీ తన మిత్రులైన అదానీ, అంబానీలకు తక్కువ ధరకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత దేశంలో ఒక్క భారీ పరిశ్రమ కూడా స్థాపించలేదన్నారు. ఉన్న పరిశ్రమలను అమ్మేయడానికి కొత్త మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయడం సిగ్గుచేటన్నారు. రెండేళ్లుగా విశాఖ ఉక్కు ఉద్యమం జరుగుతుంటే వైఎస్ఆర్ ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తోందన్నారు. ఈ రౌండ్‌టేబుల్

గూడూరులో..

సమావేశంలో శాంతి, వాణి, నాగరాజు, వెంకటేష్, సురేష్, సురేంద్ర, బాబు, తిరుమలై, బాలయ్య, సిద్దయ్య, ప్రదీప్, వడివేలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో... నాయుడుపేట - మదనపల్లి జాతీయ రహదారిలో రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, ఎఐటియుసి నాయకులు జనమాల గురవయ్య, నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, గోపి, కుప్పమ్మ, కుమార్, రాజా, వెలివేంద్రం, అన్వర్‌బాషా పాల్గొన్నారు. టుటౌన్ సిఐ మల్లికార్జున్ ఆధ్వర్యంలో కార్మిక నాయకుల రాస్తారోకోను భగం చేసి స్టేషన్‌కు తరలించి, సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

పుత్తూరులో... సిపిఐ, సిపిఎం, టిడిపి సంయుక్త ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. వక్తలు మాట్లాడుతూ దేశభక్తి పేరు చెప్పి కేంద్రం దక్షిణ కొరియాకు చెందిన పోస్కోకు విశాఖ స్టీలు ప్లాంట్ కట్టబెట్టాలని కుట్ర చేస్తోందని, దీన్ని వ్యతిరేకిస్తూ విశాఖలో పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో 800 రోజుల నుంచి నిరసన దీక్షలు చేస్తూనే ఉన్నారన్నారు. ఇటీవల కేంద్ర మంత్రి విశాఖ సందర్శించిన సందర్భంగా స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై ఉదయం ఒక మాట, సాయంత్రం మరో మాట ప్రకటించడాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం, టిడిపి నాయకులు మహేష్, వెంకటేష్, షణ్ముగరెడ్డి, నాయకులు జీవరత్నం నాయుడు, ధనపాల్, యుగంధర్, ఆనంద్, సెల్వరాజ్, గోపి, రవి, పురుషోత్తం, సుబ్రమణ్యం పిళ్లై, సుధాకర్ పాల్గొన్నారు. **వెంకటగిరిలో..** కాశీపేట కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి. రమణయ్య, సిపిఐ జిల్లా నాయకులు పి. బాలకష్ణయ్య, ఏఐటీయూసీ నాయకులు జాన్, సిహెచ్. చిన్న ఓబయ్య పాల్గొన్నారు.

తిలా పాపం... తలా పిడికెడు..

'నకిలీ' డొంక కదులుతోంది

- అక్రమార్కుల్లో ఇంటిదొంగలు
- నోరు మెదపని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్ నగర్‌లో నకిలీ పట్టాల డొంక కదులుతోంది. పురపాలక సంఘం కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా పనిచేసే అల్లూరయ్య నుంచి మంగళవారం 309 నకిలీ పట్టాలు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ తరువాత అల్లూరయ్య ఇచ్చిన సమాచారం మేరకు రాజీవ్ నగర్ లోని ఓ ఇంటి నుంచి మరో 1,300కు పైగా నకిలీ పట్టాలను రెవెన్యూ, పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ నకిలీ పట్టాల రాకెట్ లో రెవిన్యూ, పురపాలకశాఖకు చెందిన ఉద్యోగులతో పాటు కొంతమంది మాజీ కౌన్సిలర్లు, అధికార పార్టీ నేతల హస్తం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. నకిలీ పట్టాల వివరాలు మీడియాకు చెప్పకుండా రెవిన్యూ, పోలీసులు సమాధానం దాటవేయడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. 'తిలాపాపం... తలాపిడికెడు' అన్న చందంగా ఈ కేసులో 'ఇంటిదొంగల' హస్తం ప్రముఖంగానే ఉన్నట్లు సమాచారం.

పురపాలక ఉద్యోగి అల్లూరయ్య ఇంటిపై మంగళవారం రెవిన్యూ, పురపాలక, పోలీసులు ఉమ్మడిగా దాడి చేసి 309 ఇంటి పట్టాలు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ తరువాత అల్లూరయ్యను శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు విచారణలో అల్లూరయ్య విస్తు పోయే నిజాలు చెప్పినట్లు సమాచారం. అల్లూరయ్య పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి పొద్దు పోయాక రాజీవ్ నగర్ లో మరో ఇంటిని పోలీసులు, రెవిన్యూ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 1,300కు పైగా ఇంటి పట్టాలు వారికి లభ్యమయ్యాయి. ఈ పట్టాలపై శ్రీకాళహస్తి పూర్వపు తహసీల్దార్లు సర్దార్ బాషా, సురేంద్రబాబు, వీరాస్వామితో పాటు తొట్టంబేడు తహసీల్దారుగా పని చేసిన శంకర వరప్రసాద్ సంతకాలు ఉన్నట్లు అధికారులు కనుగొన్నారు. రెవిన్యూ శాఖ పరిధిలో ఉండాల్సిన ఇంటి పట్టాలు పురపాలక శాఖ ఉద్యోగి ఇంట్లో వందల సంఖ్యలో ఉండటంతో అధికారులు ముక్కున వేలేసుకుంటున్నారు. రెవిన్యూ, పురపాలకశాఖలో పని చేసే ఉద్యోగుల సహకారం లేకుండా ఇలా చేయడం సాధ్యం కాదని అధికారులు అనుమానిస్తున్నారు. నకిలీ పట్టాల రాకెట్ లో కొంతమంది మాజీ కౌన్సిలర్లు, అధికార పార్టీకి చెందిన వారితో పాటు ఇతరులు కొంతమంది కీలక పాత్ర పోషించినట్లు అల్లూరయ్య పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం. అల్లూరయ్య నోరు తెరిస్తే తమ పరిస్థితి ఏమిటని వీరిలో భయం పట్టుకున్నట్లు తెలిసింది.

ఆ రెవెన్యూ ఉద్యోగిపై అందరికీ అనుమానం

రాజీవ్ నగర్‌లో నకిలీ ఇంటి పట్టాలు గుట్టు రట్టు కావడంతో శ్రీకాళహస్తి తహసీల్దారు కార్యాలయంలో పనిచేసే ఓ రెవిన్యూ ఉద్యోగిపై అందరికీ అనుమానాలు వస్తున్నాయి. ఉద్యోగం అడ్డం పెట్టుకుని ఆయన విచ్చల విడిగా అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. రాజీవ్ నగర్ లో ఆయన ఒక్కో పనికి ఓ ధర నిర్ణయించాడు. విద్యుత్ కనెక్షన్ కు సర్టిఫికెట్ కావాలంటే రూ.30వేలు, ఖాళీ జాగా కావాలంటే రూ.2 నుంచి రూ.3లక్షలు నిర్ణయించాడు. రాజీవ్ నగర్ లే అవుట్‌తో పాటు... రద్దు చేసిన ఇళ్ల వివరాలను చేతిలో పెట్టుకుని ఈయన బహిరంగంగా వ్యాపారం చేస్తున్నారు. రాజీవ్ నగర్ పుణ్యమా అని ఈయన అనతికాలంలోనే రూ.కోట్లకు పడగలెత్తాడు. రాజీవ్ నగర్ ఈయనకు బంగారు గుడ్లు పెట్టే బాతుగా మారింది. ఈయన అక్రమాలు గురించి శ్రీకాళహస్తిలో కథలు కథలుగా చెబుతుంటారు. ఈయన గురించి ఓ మహిళ చేసిన ఆరోపణలు సామాజిక మాధ్యమాల్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సష్టించినా రెవిన్యూశాఖ అధికారులు అతనిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇందుకు కారణం ఆయనకు బలమైన రాజకీయ అండ ఉండటమేనని ప్రచారం ఉంది.

పరమేశ్వరస్వామి పేరుతో ఇచ్చిన పట్టాల మాటేంటి...?

రాజీవ్ నగర్ లో నకిలీ ఇంటి పట్టాల గుట్టు రట్టు కావడంతో తొట్టంబేడు తహసీల్దారుగా పని చేసిన పరమేశ్వరస్వామి ఇచ్చిన పట్టాల మాటేంటని శ్రీకాళహస్తి వాసులు చర్చించుకుంటున్నారు. రాజీవ్ నగర్ లో ఇంటి పట్టాలు ఇవ్వడానికి శ్రీకాళహస్తి తహసీల్దారుకు మాత్రమే అధికారం ఉంది. తొట్టంబేడు మండల పరిధిలో కొంత భూమి ఉన్నప్పటికీ... ఇళ్ల స్థలాల కోసం ఈ భూమిని సేకరించి శ్రీకాళహస్తి రెవిన్యూ శాఖకు స్వాధీనం చేశారు. అప్పటి నుంచి ఈ భూమి శ్రీకాళహస్తి రెవిన్యూశాఖ పరిధిలో ఉంది. అయితే తొట్టంబేడు తహసీల్దారుగా పని చేసిన పరమేశ్వరస్వామి పేరున ఇటీవల సుమారు 300 పట్టాలు ఇచ్చారు. ఈ పట్టాలను ఓ రాజకీయ పార్టీకి చెందిన వారు తమ అనుచరులకు ఇచ్చారు. ఇదెలా సాధ్యమైందో అధికారులకే ఎరుక. గతంలో రద్దు చేసిన ఇంటి పట్టాల వివరాలు సేకరించి... వాటికి పరమేశ్వరస్వామి పేరున పట్టాలు ఇచ్చారు. ఆ పట్టాల్లో పరమేశ్వరస్వామి సంతకం పెట్టారా...? లేక ఆయన సంతకం ఫోర్జరీ చేశారా...? అధికారులే తేల్చాలి. ఈ పట్టాల విషయం... రాజీవ్ నగర్ లో ఇళ్ల పట్టాల అక్రమ వ్యాపారం విషయం అధికారులకు తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో ముక్కంటికే ఎరుక.

ఎవరినీ వదలిపెట్టం

కెఎస్ రామారావు, శ్రీకాళహస్తి ఆర్డీవో

రాజీవ్ నగర్‌లో నకిలీ ఇంటి పట్టాల రాకెట్ లో ఎంతటి వారున్నా వదలి పెట్టబోమని శ్రీకాళహస్తి ఆర్డీవో కేఎస్ రామారావు చెప్పారు. ఈ నకిలీ పట్టాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ పట్టా ఒకటి దొరికినా... వెయ్యి దొరికినా కఠిన చర్యలు తప్పవన్నారు.

మూడోరోజూ క్రీడా స్ఫూర్తితో...

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఎపి సిఎం కప్ క్రీడాకారులు మూడో రోజూ క్రీడా స్ఫూర్తితో తలపడ్డారు. హాకీ మహిళా టోర్నమెంట్‌లో పది లీగ్ కం నాకౌట్ మ్యాచ్‌లు తలపడ్డాయి. నెల్లూరు, వెస్ట్‌గోదావరి, అనంతపురం, ఈస్టు గోదావరి జిల్లాలో విజయం సాధించాయి. ఫుట్‌బాల్ పురుషుల విభాగంలో 12 మ్యాచ్‌లు జరిగాయి. కడప, అనంతపురం డ్రాగా ముగిసింది. కర్నూలు, నెల్లూరు డ్రాగా ముగిసాయి. వెస్ట్‌గోదావరి, విజయనగరం విజయం సాధించాయి. బాక్సింగ్ పురుషుల విభాగంలో 127 మంది పురుషులు, 70మంది మహిళలు పాల్గొన్నారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్నాయి. తిరుపతిలో తొలిసారిగా బాక్సింగ్ పోటీలు జరుగుతున్నాయి. వాలీబాల్ బాలికల విభాగంలో విశాఖపట్నం, వెస్ట్‌గోదావరి, ప్రకాశం, విశాఖపట్నం గెలుపొందాయి. పురుషుల విభాగంలో ప్రకాశం, వెస్ట్‌గోదావరి, కడప, శ్రీకాకుళం, గుంటూరు, ప్రకాశం, కృష్ణా గెలుపొందాయి. టేబుల్ టెన్నిస్ టీం ఈవెంట్ పురుషుల విభాగంలో విశాఖపట్నం, కృష్ణా, ఈస్టు గోదావరి మొదటి, రెండు, మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచాయి. మహిళల విభాగంలో విశాఖ, కృష్ణా, చిత్తూరు విజేతలుగా నిలిచారు. ఈ పోటీలు సెట్విన్ సిఇఒ మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

6 నుంచి భగత్‌సింగ్ ట్యూషన్ సెంటర్‌లో 'వేసవి వినోదం'

ప్రజాశక్తి-తిరుపతి టౌన్



'వేసవి వినోదం' కరపత్రాన్ని బుధవారం భగత్‌సింగ్ ట్యూషన్ సెంటర్, వేమన విజ్ఞాన కేంద్రం, మేక్ మై బేబి జీనియస్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో విడుదల చేశారు. తిరుపతి, తిరుచానూరు, బిటిఆర్ పురం కాలనీల్లో ప్రారంభించే ఈ వేసవి వినోదం కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రేషన్ కొరకు 9490300496, 9515729579, 9398000686, 8465931520 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. 6వ తేదీ న ప్రారంభం డాన్స్, జానపదం, కోలాటం కరాటే, పాటలు, అంద మైన చేతి వ్రాత, పాటలు, క్విజ్, క్యారమ్స్, తెలుగు, ఇంగ్లీషు తప్పులు లేకుండా రాయడం చదవడం నేర్పించడం, 15 వేల ఇంగ్లీష్ పదాలు నేర్పించడం జరుగుతుంది. దీన్ని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరురు. భగత్ సింగ్ ట్యూషన్ సెంటర్ ఆద్వర్యంలో సమ్మర్ క్యాంప్ మే, జూన్ నెలలో సుందరయ్య నగర్ కమ్యూనిటీ హాలు, తిరుపతిలో ఉదయం 9:00 నుండి 12.00 వరకు సాయంత్రం 6 నుండి8.30 వరకు నిర్వహిస్తున్నట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి , డి.వై.ఎఫ్.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ జయచంద్ర, జిల్లా అధ్యక్షులు నరేంద్ర, కార్యదర్శి కె.సుమన్ నాయకులు చందన, గంగులప్ప, సోమశేఖర్, హర్షిత, యోగి, దీపు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ వేసవి సెలవులు అంటే బందువులతో కలసి ఆట, పాట, కథలతో కాలక్షేపం చేసేవారని, నేడు వేసవి సెలవుల్లోను ఇళ్లకే పరిమితం అయిపోయి సెల్ ఫోన్లు, టి.వి ,వీడియో గేమ్ లకు బానిసలవుతున్నారు.

గూడూరులో ఎంపీ పర్యటన

ప్రజాశక్తి-గూడూరు: పట్టణంలో బుధవారం తిరుపతి ఎంపీ గురుమూర్తి పర్యటించారు. గూడూరు పట్టణ ప్రముఖ వైద్యులు సిఆర్ రెడ్డి ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న ఎంపీ, సిఆర్ రెడ్డి కుటుంబ సభ్యులైన వైద్యులు జనార్ధన్ రెడ్డి, రోహిణిలను పరామర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం పట్టణంలోని నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు మేరిగ మురళీధర్ నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై, వివిధ గ్రామాలలో సమస్యలపై, జరుగుతున్న అభివద్ధి పనులపై ఆరాతీశారు. డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీల సమస్యలపై, భూ పంపిణీపై, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల గురించి స్థానిక ఆర్డీవో కిరణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో గూడూరు 24 సొసైటీ చైర్మన్ అట్ల శ్రీనివాసులు రెడ్డి, ఎంపీపీ గూడూరు గురవయ్య, వైసీపీ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్ రెడ్డి, చిల్లకూరు జడ్పిటిసి మన్నెం శీనయ్య, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రతిభకు పురస్కారాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక డిపోలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ రంగాలలో ప్రతిభ కనపరిచిన ఉద్యోగులకు డిపో మేనేజర్ రాజవర్ధన్ రెడ్డి బుధవారం ప్రశంసా పత్రాలను అందజేశారు. అధికంగా ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లకు, అదేవిధంగా అధిక ఆదాయం సంపాదించిన కండక్టర్లకు, బస్సుల నిర్వహణ సక్రమంగా చేసి ఎటువంటి సాంకేతిక లోపం లేకుండా బస్సులు నిర్వహించిన మెకానికాల్ సుపర్‌వైజర్లకు, విధి నిర్వహణలో పర్యవేక్షణ ప్రతిభావంతంగా చేసిన మెకానికాల్, ట్రాఫిక్ సుపర్‌వైజర్లకు ప్రశంసా పత్రాలతో పాటు ప్రోత్సాహకాలను అందించారు. ఉత్తమ కండక్టర్లుగా సరస్వతి, వెంకటాద్రి, ఉత్తమ డ్రైవర్లుగా ఆర్ముగం, సురేష్‌లు ఎన్నికయ్యారు.

విజయ కుమారికి డాక్టరేట్

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పరిశోధన విద్యార్థి విజయ కుమారికి బుధవారం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎం.దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు విభాగాధిపతి వి.కష్ణవేణి ఆధ్వర్యంలో 'ఆదెల్ల శివకుమార్ నవలలు-పరిశీలన' అనే అంశంపై సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. విజయ కుమారికి డాక్టర్ అవార్డు రావడంపై పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

కర్ణాటక ప్రజలు కాంగ్రెస్ వైపే: చిట్టిబాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కర్ణాటకలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలలో ఇక్కడి ప్రజలు కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతున్నారని ఏపీ కాంగ్రెస్ కమిటీ ఎస్సి విభాగం కో చైర్మన్ చిట్టిబాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. కర్ణాటక రాష్ట్రం దేవనహళ్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా విధులు నిర్వహిస్తున్న చిట్టిబాబు మాజీ కేంద్రమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి కెహెచ్ మునియప్ప విజయం సాధించాలని విస్తతంగా ప్రచారం చేస్తున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.డి.మునిరాజా పాల్గొన్నారు.

రక్తదానం అందరి సామాజిక బాధ్యత

ప్రజాశక్తి-గూడూరు టౌన్: రక్తదానం చేయడం అందరి సామాజిక బాధ్యత అని ఏఐఎస్ఏ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ సర్దార్ షఫీ హారన్ అన్నారు. బుధవారం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏఐఎస్ఏ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ షఫీ మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్న వారిని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మహేంద్ర, గురు, శివ, శశి, మురళి పాల్గొన్నారు.

ఇంటి స్థలం ఆక్రమించారని నిరసన

ప్రజాశక్తి-బాలాయపల్లి: పట్టాలు ఉన్న ఇంటి స్థలం ఆక్రమించారని ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద మహిళలు నిరసన చేశారు. ఈ సందర్భంగా దేవళ్ళ. మంగమ్మ, పసుపులేటి కమల, శైలజలు మాట్లాడుతూ మండలంలోని పచ్చారు చేను రెవెన్యూ శాఖ అధికారులు 2021 జనవరి 8 వ తేది నీవే స్థలాలకు పట్టాలు ఇచ్చారు. ఆ స్థలం చంద్రగిరికి చెందిన రమేష్, రామయ్య లు ఆక్రమించారని పలు మార్లు చెప్పినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని తెలిపారు. గతంలో ఇంటి స్థలం కావాలని అధికారులకు మొర పెట్టుకోగా ఇంటి స్థలం చూపించి పట్టాలు మంజూరు చేస్తే ఆ స్థలాన్ని దౌర్జన్యంతో ఆక్రమణ చేశారని వారు చెప్పారు. అనంతరం తహశీల్దారు వచ్చి మీకు ఇచ్చిన స్థలంలో ఇంటి పనులు చేసుకోండని తెలిపారు. ఎవరైనా అడ్డుపడితే వారిపై పోలీసులకు చెప్పమని తెలిపారు.

మండుటెండలో ఉపాధి కూలీలు

▸▸ సేద తీరేందుకు చెట్ల నీడే దిక్కు ▸▸ పని ప్రదేశంలో కానరాని మౌలిక వసతులు

ప్రజాశక్తి-బాలాయపల్లి: గ్రామాల్లో వలసలు తగ్గించి, స్థానికంగా పని కల్పించాలనే లక్ష్యంతో గతంలో కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలనే ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఉపాధి కూలీలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూట గడవాలంటే ఉపాధి పనులకు వెళ్లక తప్పని కూలీలు అసౌకర్యాల లేమితో ఎండలో ఉపాధి పనులు చేస్తున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా ప్రస్తుతం గ్రామాలకు దూరంగా ఉన్న చెరువుల్లో గుంతలు, పూడిక తీసే పనులు కొనసాగుతున్నాయి.

పని ప్రదేశంలో వసతులు కరువు

మండలంలో ఉపాధి హామీ పథకం కింద రోజుకు 3,669 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఉపాధి కూలీలు పని చేసే ప్రదేశంలో మౌలిక వసతులు కరువయ్యాయి. ఉపాధిహామీ చట్టం ప్రకారం పని ప్రదేశంలో నీడ, మంచి నీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండాలని నిబంధనలు ఉన్నప్పటికీ అవేమీ కానరావడం లేదు. పని చేస్తున్న సమయంలో గాయాలైతే ప్రథమ చికిత్స అందించడానికి ఫస్ట్ ఎయిడ్ కిట్లు సైతం పని ప్రదేశంలో ఉండటం లేదు. నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సరఫరా చేయడమే మానేసింది. కనీసం తాగునీరు లేకపోవడంతో కూలీలు తమ వెంట నీళ్ల బాటిళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

నీడ లేక తిప్పలు

వేసవి కాలం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతోంది. ఎండవేడిలో గంటల తరబడి పనులు చేస్తున్న కూలీలు అలసటకు గురై కొంత సమయం సేద తీరుదామనుకున్నా పని ప్రదేశంలో నీడ ఉండటం లేదు. పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు వేయాల్సి ఉండగా గత కొన్నేళ్లుగా అధికారులు ఆ మాటే మర్చిపోయారు. ఉమ్మడి జిల్లాలకు ఏడేళ్ల క్రితం టెంట్లను సరఫరా చేసిన ప్రభుత్వం ఇప్పటి వరకు తిరిగి టెంట్లు అందజేసిన దాఖలాలు లేవు.

మండుతున్న ఎండలు

మండలంలో రోజూ 37 డిగ్రీలకు పైబడి ఎండలు మండుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ ఎండలు 40 నుంచి 45 డిగ్రీల వరకు వెళ్లే పరిస్థితి ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అటువంటి సమయంలో సౌకర్యాలు లేకుండా ఉపాధి పనులు చేయడం చాలా కష్టమని కూలీలు వాపోతున్నారు.

నీడ, నీళ్ళు లేవు

ఉపాధి పనుల వద్ద కనీసం నీడ ఉండటం లేదు. ప్రతి రోజూ ఎండలు మండిపోతున్నాయి. పనులు చేశాక సేద తీరేందుకు నీడ లేక మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇక తాగేందుకు నీళ్లు ఉండడం లేదు. మజ్జిగ ఇచ్చిన పరిస్థితి లేదు **-పుల్లయ్య, శివ కడగుంట గ్రామ ఉపాధి కూలీలు**

కూలీలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

ఉపాధి పనులకు వస్తున్న కూలీలకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం. ప్రభుత్వం నుంచి టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు రావడం లేదు. ఇతర అవసరాలకు ఇటీవల ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రతిపాదనలు పంపించాం **-స్వరూప రాణి ఎంపీడీఓ, బాలాయపల్లి**

మీ కోసం జీవితాంతం కృషి చేస్తా: మంత్రి రోజా

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వైసీపీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఎదిగిన నేను మీకు ఎంత చేసినా తక్కువే అవుతుందని, మీ రుణం తీర్చుకోవడానికి మీకోసం జీవితాంతం నేను, నా కుటుంబం పని చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక వ్యవహారాల, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్.కె. రోజా తెలిపారు. వడమాలపేటలో బుధవారం జరిగిన మండల వైసీపీ కార్యకర్తల సమావేశంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ వడమాలపేట నగరి నియోజకవర్గానికి ముఖద్వారం, అలాగే నా విజయానికి ఎప్పుడూ గుండెకాయ లాంటిదని అన్నారు. ఈరోజు దేశంలో ఏ రాష్ట్రంలో ఎవరికీ లేని ఒక మనసున్న ముఖ్యమంత్రి మన రాష్ట్రానికి ఉన్నారు కాబట్టే ఎన్నో ఏళ్లుగా ప్రజలు కోరుకుంటున్న అభివద్ధి పనులను ఈ రోజు మేం చేయగలుగుతున్నామని చెప్పారు.

నూతన నియామకాలు: వడమాలపేట మండల కన్వీనర్‌గా సుబ్రహ్మణ్యం రెడ్డి, సచివాలయం కన్వీనర్‌గా మాజీ జడ్పిటిసి సురేష్ రాజు, డిస్ట్రిక్ బీసీ సెక్రటరీగా సదాశివయ్య, డిస్ట్రిక్ ప్రధాన కార్యదర్శిగా ఉమాపతి, సర్పంచ్ సంఘం, వడమాలపేట మండలం సర్పంచ్ల సంఘం ప్రెసిడెంట్‌గా కదిరి మంగళం సర్పంచ్ మంజులను మంత్రి ప్రకటించారు. సమావేశంలో పార్టీ కన్వీనర్, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీ టీసీలు, సర్పంచులు, రాష్ట్ర డైరెక్టర్లు, కాణిపాకం ఆలయం, మార్కెట్, సింగిల్ విండో, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గహ సారథులు, వాలంటీర్స్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు: చైర్మన్ మధుబాల

ప్రజాశక్తి-క్యాంపస్: స్థానిక అన్నమయ్య సర్కిల్ నందు (ఆల్ ఇండియా రేడియో వెనకాల) వున్న ప్రభుత్వ గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయంతో పాటు జిల్లాలోని 69 గ్రంథాలయాల్లో మే 8 నుంచి జూన్ 16 వరకూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్మన్ నైనారు మధుబాల ఓ ప్రకటనలో తెలిపారు. 6 నుండి 10వ తరగతులలో చదువుతున్న విద్యార్థులకు యోగ, మెడిటేషన్, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రామా, నాటికలు, ఇంగ్లిష్ గ్రా మర్, చెస్, క్యారమ్స్ , సంగీతం ఇతర అంశాలపై ఉచితంగా శిక్షణ ఇప్పించి ప్రతివారం విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం వారు వారి పిల్లలను ఈ ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొనేల ప్రోత్సహించాలని కోరారు. కావున తిరుపతి పట్టణం నందలి 6 నుండి 10వ తరగతి లలో చదువుచున్న, ఈ సమ్మర్ క్యాంపులో పాల్గొనుటకు ఆసక్తి వున్న విద్యార్థిని, విద్యార్థులు ఎవరైనా గ్రందాలయాధికారి ఫోన్ నెంబర్ -99121 89869కి ఫోన్ ద్వారా (లేదా) శాఖా గ్రంథాలయం, తిరుపతికి వచ్చి వారి పేర్లను నమోదు చేసుకోవలసినదిగా తెలిపారు. ఈ ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో పైన తెలిపిన అంశాలలో శిక్షణ ఇవ్వడానికి ఆసక్తిగల టీచర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, రచయితలు, కవులు, స్వచ్ఛంద సంస్థలు ఇంకనూ ఎవరైనా ఉచితముగా శిక్షణ ఇచ్చే వారు (రిసోర్స్ పర్సన్స్) గ్రంథాలయాధికారికి ఫోన్ ద్వారా వారి వివరములు తెలుపవలసినదిగా పేర్కొన్నారు.

రేపు తిరుమలలో పౌర్ణమి గరుడసేవ

ప్రజాశక్తి-తిరుమల: తిరుమలలో మే 5వ తేదీ పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరగనుంది. ప్రతి నెలా పౌర్ణమి సందర్భంగా తిరుమలలో గరుడసేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడ వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు.

తప్పుచేస్తే సిఎంకైనా శిక్ష తప్పదు : గోనె ప్రకాష్

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం) : దేశ చరిత్రను తిరిగి చూస్తే సిఎంలు, ప్రతినిధులు ఎవరైనా తప్పు చేస్తే చట్టం, న్యాయం ముందు శిక్ష తప్పదని, మాజీ ఎంఎల్ఎ, ఎపిఎస్ ఆర్‌టిసి ఉమ్మడి రాష్ట్రాల మాజీ చైర్మన్ గోనె ప్రకాష్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ తన వయస్సు 75 సంవత్సరాలని, వైఎస్ ఆర్ ఇంట్లో ఓ కుటుంబ సభ్యునిగా మెలిగానన్నారు. నేటి తెలంగాణా, ఆంధ్ర సిఎంలు తనకు సన్నిహితులన్నారు. ఎన్టీఆర్ నటించిన పాత చిత్రాలు పాండురంగ మహత్యంలో (వేశ్య లోలుడు), వాల్మీకి (దోపిడీ దొంగ)గా కథానాయకులు చేసిన పాత్రలు నేటి సిఎంలు గ్రహించి పద్ధతులు మార్చుకోవాలన్నారు. మంత్రుల తండ్రులూ తనకు సన్నిహితులన్నారు. వైఎస్ వివేకానంద మరణం రాజకీయ హత్యేనని, నిందితుడుగా ఉన్న అవినాష్‌రెడ్డిని ఎవ్వరూ కాపాడలేరన్నారు. ఈ హత్య వెనుక ఉన్నవారు చట్టం ముందు తప్పించుకోలేరన్నారు.

మహిళా వర్సిటీలో పద్మావతి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం పూర్తి సహాయ సహకారాలతో శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేశారు. బుధవారం ఉదయం 8 గంటలకు శ్రీ పద్మావతి అమ్మవారు విగ్రహ ప్రతిష్టను పూర్ణకుంభాభిషేకం ప్రాణ ప్రతిష్టతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే రాజారెడ్డి, వర్సిటీ కుల సచీవులు ఆచార్య ఎన్. రజిని మాట్లాడుతూ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం ఏర్పాటు చేయాలని ఎన్నో సంవత్సరాలుగా వర్సిటీ ఉన్నతాధికారులు టిటిడికి విన్నవిస్తున్నారని తెలిపారు. గతంలో మాజీ ఉపకులపతులు ఆచార్య దుర్గాభవాని, ఆచార్య దువ్వురు జమున టిటిడి ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేసిన కారణంగా నేడు ఆలయాన్ని పూర్తిస్థాయిలో నిర్మించడం జరిగిందన్నారు. టీటీడీ ప్రస్తుత చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈఒ ధర్మారెడ్డి ల సహకారంతో పూర్తి చేసినట్లు చెప్పారు. శ్రీ పద్మావతి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కోసం నిర్వహించవలసిన క్రతువులను, కుంబాభిషేక మహోత్సవాలను గత మూడు రోజులుగా వర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పద్మావతి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు అధునాతన తరగతి గదులతో పాటు సరికొత్త ల్యాబ్ లను, పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయడమే కాకుండా వర్సిటీ క్యాంపస్‌లో గుడి నిర్మాణం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడం ద్వారా విద్యార్థులకు ఆధ్యాత్మిక భావన ద్వారా మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు.

ఘనంగా ఎస్‌సివి నాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు జన్మదిన వేడుకలు ఆయన స్వగహంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, అభిమానులు భారీగా తరలివచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారి మధ్య భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరి శ్రీనివాసులు, సత్రవాడ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ముగిసిన పోలేరమ్మ జాతర

ప్రజాశక్తి-నాయుడుపేట: స్థానిక గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ జాతర వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఈ జాతర వేడుకల్లో అగ్రహారపేట హరిజనవాడకు మునుపెన్నడూ లేని అరుదైన గౌరవం ఈ సంవత్సరం దక్కింది. 24వ వార్డు కౌన్సిలర్ దారా రవి కషి, పట్టుదలతో నాయుడుపేట నాయకులకు, ఆయనకు ఉన్న మంచి సన్నిహితంతో ఆయన గ్రామానికి జాతరలో భాగస్వామ్యం లభించింది. మంగళవారం హరిజనవాడ నుంచి కౌన్సిలర్ ఆధ్వర్యంలో గ్రామస్తులంతా కలిసి అమ్మవారికి సారె తీసుకెళ్లారు. దీంతో హరిజనవాడ గ్రామ ప్రజలకు సారె తీసుకెళ్లే అవకాశం కల్పించినందుకు ప్రతిఒక్కరూ కౌన్సిలర్‌కు కతజ్ఞతలు తెలిపారు. పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులకు జాతర పేరిట చేసిన వసూళ్లపై, జాతరలో నిండే హుండీ పై ఉన్న ఆలోచన జాతరకు వచ్చే భక్తులపై కనిపించలేదని చెప్పాలి. ఏర్పాట్లు సక్రమంగా లేక భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. వచ్చిన భక్తులకు దర్శానికి ఎలా వెళ్లాలో, దర్శనం చేసుకున్నాక బయటకు ఎలా వెళ్లాలో తెలియక తికమక పడుతూ ఉన్న కొద్ది పాటి దూరానికి గంటల తరబడి క్యూలో వేచి ఉండలేక విసిగిపోయారు. కమిటీ సభ్యులు జాతరకు నియమించిన వాలంటీర్లు భక్తులకు సాయం చేయకపోగా వాళ్ళకు సం బంధించిన వాళ్ళను క్యూలైన్లు ఆపి ఎదురుగా తీసుకొచ్చి దర్శనం చేయించటంలో నిమగ్నమయ్యారు.

కార్మికులు సంఘటితం కావాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సమస్యల సాధనకు కార్మికులు సంఘటితం కావాలని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఏపీసీడ్స్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఐఎన్టీయూసీ 76వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు ఎంత మారినా కార్మికుల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు పదవీ విరమణ పొందిన తరువాత వారి వేతనంలో కేవలం 40 శాతం మాత్రమే పింఛను రూపంలో ఇస్తున్నారన్నారు. ఈ సొమ్ము వారి కుటుంబ పోషణకు ఏ మూలకు చాలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదవీ విరమణ పొందిన కార్మికులకు వారి వేతనంలో కనీసం 80 శాతం పింఛను ఇవ్వాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రత్నకుమార్, కార్యదర్శి ప్రసాద్, తిరుపతి జిల్లా అధ్యక్షులు ఈశ్వరరెడ్డి, కార్మిక సంఘం నేతలు మునెయ్య, గురవయ్య, హరిబాబు, వరమ్మ, రమణమ్మ, గిరిజ, చెంగల్రాయులు, చంద్రమ్మ పాల్గొన్నారు.

జెఈఈ మెయిన్స్‌లో 'ఆకాష్' ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి సిటి: ఇటీవల విడుదలైన జెఈఈ మెయిన్స్‌లో తిరుపతి ఆకాష్ బైజూస్ విద్యార్థి ఆర్.గణేష్ సాయి 99.42 శాతం పర్సంటేజ్‌తో అత్యుత్తమ ప్రతిభ సాధించారని ఆ విద్యాసంస్థ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ అభిషేక్ మహేశ్వరి తెలిపారు. బుధవారం ఆమె విలే కరులతో మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత కఠిన మైన ప్రవేశ పరీక్షగా భావిస్తోన్న ఐఐటి జెఈఈలో తమ విద్యార్థి గణేష్ విజయం సాధించడం సంతోష కరమన్నారు. కాన్సెప్ట్‌లను అర్థం చేసుకోవడంలో తాను పడిన కష్టం, లెర్నింగ్ షెడ్యూల్స్‌కు కట్టుబడి ఉండడమే టాప్ పర్సంటేజ్ సాధించి ఎలైట్ జాబితాలో చోటు సంపాదించుకున్నారన్నారు. జెఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

సాగు భూమికి పట్టాలు ఇవ్వండి: సిపిఐ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: విఎస్ పురం దళితులు సుమారు 20 సంవత్సరాల నుంచి మండలంలోని కాటూరు గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 340, 341 లలో సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కత్తి రవి, బియన్ కండ్రిగ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్యలు బుధవారం రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు దళారులతో కుమ్మక్కై నిరుపేద ప్రజలకు అన్యాయం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల్లో ఈ సమస్య పరిష్కరించకుంటే కలెక్టర్ ఆఫీస్‌ని ముట్టడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కష్ణయ్య, పీటర్, సిద్ధయ్య, దాసు, వెంకటేశు, రమణయ్య, మహిళలు పాల్గొన్నారు.

SPECIAL II
BEFORE THE MOTOR ACCIDENTS CLIAMS TRIBUNAL AT CHENNAI
M.C.O.P. 4424 OF 2021

K. Deepa and another ....Petitioners
Vs
1.Durgam Transports
2.Sriram Gen. Insurance Company Ltd., ... Respondent

To
Durgam Transports
Represented by Proprietor Mrs. Nirma,
D.No.19-8-18A,
Dasarimattam,
Dasarimattam Municipality,
Tirupati Urban,
Tirupati District, A.P. 517 501

NOTICE

It is notified that the above named petition had filed the above petitioner claiming compensation for the death of her daughter in a road accident on 10.08.2021. The same is posted for your appearance on 02.06.2023. You are hereby called upon to appear before the above said court on the said day at 10.30 a.m. and submit your objections either in person or by a duly instructed advocate, failing which the case will be decided in your absence.

S. BALAJI, B.A. B.L.,
ADVOCATE, PONNERI.

టిడిపి కార్యకర్త మృతికి నివాళి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రూరల్ మండలం పరమేశ్వర మంగళం గ్రామ పంచాయతీకి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త పి.సి.సుబ్రమణ్యం నాయుడు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న నగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ భాను ప్రకాష్ సంఘటనా స్థలానికి చేరుకొని భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అంతరాష్ట్ర దొంగ అరెస్టు

ప్రజాశక్తి-సత్యవేడు: మండలంలో జరిగిన రెండు చోరీ కేసుల్లో గని భాష అనే నిందితుడిని పోలీసులు అరెస్టు చేసిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. డీఎస్పీ శ్రీనివాసరావు కథనం మేరకు వివరాలు.. మండలంలో గతంలో రెండు చోరీలు జరగడంతో దీనిపై నిఘా పెట్టిన పోలీసులు సిఐ శివకుమార్ రెడ్డి పర్యవేక్షణలో ఎస్సై పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో సరిహద్దు ప్రాంతంలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో బుధవారం అనుమానాస్పదంగా ఆటో నడుపుకుంటూ తమిళనాడు నుంచి సత్యవేడు వైపుకు వెళ్తున్న వ్యక్తిని గమనించిన ఎస్సై పురుషోత్తం రెడ్డి అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో ఈ ప్రాంతంలో జరిగిన చోరీలు తానే చేసినట్లు ఒప్పుకోవడంతో వెంటనే అరెస్టు చేసి అతని వద్ద నున్న బంగారం, వెండిని స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన నిందితుడు గని భాషపై ఆంధ్ర, తమిళనాడులోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై జైలుకు కూడా పోయి వచ్చినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతం కావడంతో వాహనాల తనిఖీలు కచ్చితంగా ఉండాలని పోలీసులకు ఆదేశించినట్లు తెలిపారు.

వేసవి సెలవుల్లో జూపార్కుకు వచ్చి...

బ్యాటరీ వాహనం ఢీకొని బాలుడు మృతి

ప్రజాశక్తి-తిరుపతి సిటి: ప్రకృతి అందాలు, పులులు, సింహాలు, పక్షులు, జింకలు, ఏనుగులు, ఎలుగుబంట్లు వంటి వాటిని తిలకించి ఆనందంగా గడిపాలని వచ్చిన ఓ కుటుంబంలో బ్యాటరీ వాహనం రూపంలో విషాదం అలముకుంది. అప్పటి వరకు కన్నతల్లి చేయిపట్టుకుని రోడ్డుపై నడుస్తున్న ముక్కుపచ్చలారని మూడేళ్ల బాలుడు బ్యాటరీ వాహనం చక్రాల కింద తుదిశ్వాస విడిచిన విషాదకర ఘటన బుదవారం ఎస్‌వి జూ పార్కులో చోటు చేసుకుంది. పోలీసు కథనం మేరకు... తిరుపతి రాయల్ నగర్‌కు చెందిన సుబ్బరత్న, సుష్మాలకు ముగ్గురు సంతానం. పిల్లలకు వేసవి సెలవులు కావడంతో సుష్మా తన పిల్లలతో కలిసి శ్రీవెంకటేశ్వర జంతు ప్రదర్శన శాల (ఎస్‌వి జూ పార్కు)కు వచ్చింది. పార్కు లోపల ఓ షాపు ముందు తన కొడుకు ప్రణవ్(3)తో కలిసి నడుస్తోంది. బాలుడు తల్లి చెయ్యి పట్టుకున్న నడుస్తున్న సమయంలో అటుగా సందర్శకులను తీసుకొస్తున్న బ్యాటరీ వాహనం డ్రైవరు తప్పిదం వల్ల అదుపుతప్పి ప్రణవ్‌ను ఢీకొంది. వాహనం చక్రాల కిందపడి తీవ్రరక్తస్రావం కావడంతో అక్కేడ విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి హుటాహుటిన ద్విక్రచ వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. తనతోడబుట్టిన వారు, కన్నతల్లితో కలిసి జంతువులను చూద్దామని ఆశతో వచ్చి, పార్కులో గెంతులేసిన కుమారుడు ఉన్నట్టుండి విగతజీవిగా మారడాన్ని జీర్ణించుకోలేక తల్లి సుష్మ ఆసుపత్రి వద్ద విలపిస్తున్న విషాదకర ఘటన పలువుర్ని కంటతడి పెట్టించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఘటన వివరాలకు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM 1ST CLASS MAGISTRATE :: PUTTUR
I.A. No: 1499 / 2022
O.S.No: 313 / 2019

BETWEEN:
E. Hari Babu .....Petitioner/Plaintiff
AND:-
S. Hemavathi ..... Respondent/Defendant

NOTICE TO RESPONDENT

S. Hemavathi,
W/o C. Balaram,
Residing at D.No. 17-92, R.T.C. Colony,
Puttur Town and Mandal,
Tirupati District,

Whereas in the above named final decree petition for mortgage in I.A.No. 1499/2022 in O.S. No. 313/2019 is posted for your appearance on 09.05.2023.You are hereby informed that the 9 th day of May 2023 is posted for passing final decree. Hence, your appearance on that day before this Hon'ble Principal Junior Civil Judge, Puttur on 09.05.2023 in person or through your advocate at about 10.30 am and file your objection if any otherwise the matter will be decided Ex-party.

Date of hearing : 09.05.2023

K. Bhasker, M.A., B.L.,
A. Deepak, M.B.A., L.L.B.,
Advocates / Puttur.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: PUTTUR
O.S.No: 63 / 2015

BETWEEN:
D. Subbalakshmi .....Plaintiff
AND:-
B.Subbaramaiah (died) and others... Defendants

SUMMONS TO DEFENDANTS NO. 14, 18 &20

To
D14. K. Lokesh, S/o Late. K. Venkataiah,
D18. K. Bhanamma, D/o T. Ankaiah,
D20. N. Ramalingaiah, S/o K. Venkataiah,
All are residing at Vaddipalli Village,
Appalayagunta post,
Vadamalapet Mandal, Tirupati District.
Sirs/Madam,

Please take Summons that the plaintiff filed the above suit against you and others for Partition of the suit schedule properties. The said suit was posted to 08-05-2023 for your appearance in the above suit. If you have got any objections you may appear on 08.05.2023, at 10.30A.M either in person or through your counsel and file your objections. In the event of your failure, the matter will be decided exparte.

Date of hearing : 08.05.2023

Sri K. Purushotaham, M.A., B.L.,
Advocate for Plaintiff, Puttur.